సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 17 । జనవరి । 2025



సాగర్ నీరు వస్తేనే...

వైరా రిజర్వాయర్‌లో నీటిమట్టం నానాటికీ తగ్గుతుండగా సాగర్ జలాలు విడుదల చేస్తేనే రబీ సాగు సాఫీగా సాగనుంది. 8లో



కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యం

కాంగ్రెస్‌లో మాలల ఆధిపత్యం కారణంగానే ఎస్సీ వర్గీకరణ చేయడం లేదని ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం, సాయంత్రం తర్వాత చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ఏడు మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను 5నుంచి 8వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 నుండి ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం సీట్లలో 75శాతం మైనార్టీలకు, 25శాతం మిగతా వారికి కేటాయిస్తామని, ప్రతీ కేటగిరీలో అనాథలు, దివ్యాంగులు, వితంతువుల, సైనిక ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు మూడు శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

22 పోస్టులకు 1,014 దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఖాళీ పోస్టులను తాత్కాలిక/కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీకి నిర్ణయించగా 1,014 దరఖాస్తులు అందాయని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. 19 ఎంఎల్‌హెచ్‌పీ, మూడు బీడీకే మెడికల్ ఆఫీసర్ పోస్టులు కలిపి 22 ఖాళీలు ఉండగా.. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎంతో పాటు బ్రిడ్జి కోర్సు పూర్తిచేసి వారు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఇప్పటికే మెరిట్ లిస్టును https://khammam.telangana.gov.in/ వెబ్‌సైట్‌లో పొందుపర్చగా, అభ్యర్థుల వివరాల్లో తప్పులు ఉంటే ఈనెల 18లోగా వెబ్‌సైట్‌లోని ఫాంలో నమోదు చేయాలని సూచించారు. ఆపై సర్టిఫికెట్ల జిరాక్స్‌లు జతపరిచిన దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని డీఎంహెచ్‌ఓ తెలిపారు.

విజయ డెయిరీతో పాడిరైతులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ మోహనమురళి

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ పాడి పరిశ్రమ అయిన విజయ డెయిరీకి పాలు సమకూర్చడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఖమ్మం డీడీ పి.మోహనమురళి తెలిపారు. ఖమ్మంలోని విజయ డెయిరీ ఆవరణలో గురువారం రైతులకు ఇచ్చే రుణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాడి పరిశ్రమకు పాలు పోసే రైతులకు ప్రోత్సాహకాలు, రుణాలను అందిస్తున్నామని తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్(ఇండియన్ ఇన్ఫోలైన్ ఫైనాన్స్ లిమిటెడ్) ద్వారా పాడి గేదెల కొనుగోలు కోసం మహిళా రైతులకు రుణాలు ఇవ్వనుందని చెప్పారు. అనంతరం పాల సేకరణలో తీసుకోవాల్సిన మెళకువలు, నాణ్యతపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డెయిరీ మేనేజర్ సిద్దేశ్వర్, ఐఐఎఫ్‌ఎల్ సంస్థ బాధ్యులు దేవేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



విద్యార్థుల ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈఓ శర్మ

వైరారూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని, తద్వారా విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ కోరారు. వైరా మండలంలోని నారపునేనిపల్లి యూపీఎస్‌లో కేవలం ఒక విద్యార్థి మాత్రమే ఉండగా గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఆ తర్వాత పలువురి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తుండడమే కాక ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈమేరకు తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఉన్నారు.

అగ్గి లేస్తే బుగ్గిపాలే..

ఖమ్మం మార్కెట్‌లో పంటలకు భద్రత కరువు

- పుష్కరకాలం క్రితమే ఫైర్‌స్టేషన్‌కు శంకుస్థాపన, 2015లో ప్రారంభం
- ఫైర్ ఇంజన్ కోసం రూ.58 లక్షలు చెల్లించి మరీ ఎదురుచూపులు
- తాజాగా కాలిబూడిదైన 1,100 బస్తాల పత్తి



ఖమ్మం మార్కెట్‌లో 2015లో సిద్ధమైన ఫైర్ స్టేషన్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి జిల్లా నుంచే కాక మహబూబాబాద్, సూర్యాపేటతో పాటు ఏపీలోని పలు జిల్లాల నుంచి రైతులు పత్తి, మిర్చిని విక్రయానికి తీసుకొస్తుంటారు. పత్తి, మిర్చి సీజన్లలో నిత్యం రూ.కోటి నుంచి రూ.2కోట్ల మేర పంటల క్రయవిక్రయాలు జరుగుతాయి. ఇంతటి పేరున్న ఈ మార్కెట్‌లో అనుకోకుండా అగ్నిప్రమాదం జరిగితే తక్షణమే మంటలను అదుపు చేసేలా ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడం గమనార్హం. అయితే, మార్కెట్ ఆవరణలో ఏళ్ల క్రితమే ఫైర్ స్టేషన్ నిర్మించడంతో పాటు ఫైర్‌ఇంజన్ కోసం రూ.58లక్షలు డిపాజిట్ చేసినా వాహనాన్ని కేటాయించలేదు. ఫలితంగా బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరగగా ఇతర చోట్ల నుంచి వాహనాలు వచ్చేసరికి రూ.30లక్షల విలువైన 1,100 బస్తాల పత్తి కాలిబూడిదైంది.

2012లోనే బీజం

భారీగా లావాదేవీలు జరిగే ఖమ్మం మార్కెట్‌లో ఫైర్ స్టేషన్ ఆవశ్యకతను గుర్తించి 2012–13లో నాటి పాలకవర్గం రూ.80 లక్షలను కేటాయించడంతో భవనం నిర్మించి బోర్ వేయించారు. ఆతర్వాత ఫైర్ ఇంజన్ కోసం రూ.58 లక్షల డీడీని అగ్నిమాపక శాఖ డీజీపీకి అందజేశారు. అంతేకాక ఫైర్ స్టేషన్‌ను 2015 ఏప్రిల్ 26న నాడు కూడా మంత్రిగానే ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించగా, ఇప్పటికీ ఫైర్ ఇంజన్ మాత్రం చేరలేదు.

ఇదైతే ఉండనివ్వండి..

మంత్రి ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించిన సమయాన తాత్కాలికంగా ఖమ్మం అగ్నిమాపక కేంద్రానికి చెందిన ఓ పాత వాహనాన్ని కేటాయించారు. కానీ శాఖ సిబ్బందిని కేటాయించకపోవడంతో ఔట్ సోర్సింగ్ ద్వారా 20 మందిని తీసుకున్నారు. ఆరు నెలలు నిర్వహించాక అన్ సీజన్ పేరిట ఫైర్ ఇంజన్‌ను తిరిగి అగ్నిమాపక శాఖ తీసుకెళ్లింది. అప్పటి నుంచి ఎలాగూ ఖాళీగా ఉంటోందని తాత్కాలికంగా మార్కెట్ పరిపాలనా విభాగాన్ని నిర్వహిస్తుండడం గమనార్హం.

ఈసారైనా కరుణిస్తారా?

మార్కెట్‌లో అగ్ని ప్రమాద స్థలాన్ని గురువారం పరిశీలించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడి నుంచే ఫైరింజన్ కేటాయింపుపై శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఏళ్ల క్రితం ఫైర్‌స్టేషన్ భవనాన్ని నిర్మించడం, వాహనం కోసం వాటా ధనాన్ని చెల్లించిన విషయాన్ని వివరించగా సానుకూలమైన సమాధానం వచ్చిందని మంత్రి ప్రకటించారు.

ప్రమాదాలు జరిగినప్పుడే చర్చ

ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫైర్ ఇంజన్ లేదనే అంశం గుర్తుకొస్తోంది. రూ.58లక్షలు చెల్లించి 12ఏళ్లు కావొస్తున్నా తోచినప్పుడే ఆరా తీస్తూ వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. మార్కెట్‌లో 2023 డిసెంబర్‌లో ఓ వ్యాపారికి చెందిన రూ.40 లక్షల విలువైన పత్తి అగ్నిప్రమాదంలో కాలిపోయింది. తాజాగా బుధ వారం ఇద్దరికి చెందిన రూ.30లక్షల విలువైన 1,100 బస్తాల పత్తి బూడిదైంది. ఈ రెండు ప్రమాదాల సమయాన ఫైరింజన్ సకాలంలో రాకపోవడంతో నష్టతీవ్రత పెరిగింది.



బుధవారం నాటి ప్రమాదంలో కాలిపోతున్న పత్తి

మార్కెట్‌కు ఫైరింజన్ కేటాయించాలని అగ్నిమాపక శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సానుకూల స్పందన రాలేదు. అంతేకాక మార్కెట్‌లో నిర్మించిన అగ్ని మాపక కేంద్రం

తాత్కాలికంగా వాహనం

ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదం జరగడం, మంత్రి తుమ్మల పరిశీలన నేపథ్యాన అధికారులు గురువారం రాత్రి ఓ ఫైరింజన్‌ను పంపించారు. ఈ వాహనం వెంట పలువురు సిబ్బంది కూడా ఉన్నారు. అయితే, ఈ వాహనం ఎంత కాలం ఉంటుంది, శాశ్వత ఫైరింజన్‌ను ఎప్పుడు కేటాయిస్తారనేది తెలియాల్సి ఉంది.



ఖమ్మం మార్కెట్‌కు చేరిన వాహనంతో సిబ్బంది

పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రతపై సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి గురువారం ఆయన మార్కెట్‌లోని పత్తి యార్డులో అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉందని, మంటలు మొదలైనట్లు తెలియగానే స్పందించడం, పది నిమిషాల్లోనే ఫైర్ ఇంజన్ రావడంతో ప్రమాద తీవ్రత తగ్గిందన్నారు. అయితే, ఇలాంటివి మరోమారు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు ఖమ్మం మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు రూ.100 కోట్ల నిధులతో పనులు త్వరలోనే మొదలుకానున్నాయని తెలిపారు. ఆపై ఖమ్మం తరహాలో వరంగల్, నిజామాబాద్ వంటి మార్కెట్ల అభివృద్ధికి కూడా నివేదికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మిర్చి యార్డులో ఆధునికీకరణ పనుల నేపథ్యాన కొనుగోళ్లను పత్తి యార్డులో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని, మద్దులపల్లి మార్కెట్ నిర్వహణలోకి వస్తే ఖమ్మం మార్కెట్‌పై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఖమ్మం మేయర్ పి.నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీం, ఆర్డీఓ నర్సింహారావు, మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేష్, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రెవెన్యూ సిబ్బంది తీరు మార్చుకోవాలి...
- తహసీల్, పీహెచ్‌సీలో తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



చికిత్స కోసం వచ్చిన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వేంసూరు: ప్రభుత్వ ఉద్యోగులపై నమ్మకంతో ఉన్న ప్రజలకు మెరుగైన సేవలందించాలే తప్ప నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. వేంసూరు పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తహసీల్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులు వస్తున్నందున ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీకి వెళ్లిన కలెక్టర్ అక్కడ ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణ, రోజు వారీ, ఫార్మసీలో మందుల నిల్వలపై ఆరా తీశారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలనతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎం.ఏ.రాజు, వైద్యులు ఇందుప్రియ, శ్రీవిద్య, హసీనా పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట నిఘా

ఖమ్మంసహకారనగర్: ఈవీఎంల గోదాం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని గోదాంలను గురువారం తనిఖీ చేసిన ఆయన అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాల నిర్వహణ భద్రతా సిబ్బంది విధులపై సూచనలు చేశారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సీహెచ్.స్వామి, డీటీ అన్సారీ పాల్గొన్నారు.

వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య సస్పెన్షన్

- అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో ఉన్నతాధికారుల చర్యలు
- మరికొందరు ఉద్యోగులపైనా త్వరలోనే వేటు

వైరా: నిబంధనలకు విరుద్ధంగా వివాదాస్పద భూములకు సంబంధించి ఒకేరోజు 64 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ చేసిన వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్యపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. వైరాలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో గతనెల 28న 89 రిజిస్ట్రేషన్లు జరగగా ఇందులో 64 డాక్యుమెంట్లపై ఆరోపణలు వచ్చాయి. ఈక్రమాన కొణిజర్ల మండలంలోని అమ్మపాలెం, లింగగూడెం రెవెన్యూ పరిధి ఇండోఖతార్, గ్రీన్‌ల్యాండ్ భూముల రిజిస్ట్రేషన్‌పై వివాదం నెలకొనడంపై 'అధనపు విధులు' శీర్షికన ఈనెల 11న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. నాలా కన్వర్షన్ లేకుండా సుమారు 40 వేల గజాల స్థలానికి రిజిస్ట్రేషన్ చేయడం, ఇందులో భారీగా డబ్బు చేతులు మారి ఉంటుందనే ఆరోపణలు రాగా, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈసందర్భంగా సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేస్తూ కొద్దిరోజుల క్రితమే ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే, ఆ ఉత్తర్వులు గురువారం వెలుగుచూశాయి.

ఎక్కడ పనిచేసినా అంతే...

సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య గతంలో నిజామాబాద్‌లో పని చేయగా అక్కడ కూడా పలు అవినీతి, ఆరోపణలు వచ్చాయని తెలిసింది. ఇక వైరాలో గత ఆగస్టులోనే విధుల్లో చేరగా ఐదు నెలలు తిరకగముందే సస్పెన్షన్ వేటు పడడం గమనార్హం. కాగా, భారీ సంఖ్యలో రిజిస్ట్రేషన్ల వ్యవహారం బయటకు రాగానే ఆయన ఈనెల 10వ తేదీ నుండి 18వ తేదీ వరకు సెలవులో వెళ్లడం గమనార్హం. ఈ మధ్యలోనే ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో రామచంద్రయ్య స్థానంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా, వైరా కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరగడంపై జిల్లా రిజిస్ట్రార్‌పైనా మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. త్వరలోనే ఈ వ్యవహారంలో మరికొందరిపై చర్యలు తీసుకునే అవకాశముందని తెలిసింది.

రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన



నిర్మాణ ప్రాంతంలో పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్, రూరల్ మండలాల్లో మున్నేటికి ఇరువైపులా రూ.690కోట్ల వ్యయంతో చేపడుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఇటీవల మొదలయ్యాయి. రెండు వైపులా కాలనీలను ముంపు బారి నుంచి రక్షించేందుకు రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తుండగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తరచుగా పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యాన పనులను గురువారం క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు పరిశీలించారు. ఈఈ తేజావత్ వెంకటరమణ, డీఈ చంద్రశేఖర్ తదితరులను క్షేత్రస్థాయిలో నాణ్యతతో పాటు లెవల్స్‌పై ఆరా తీశారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే శరవేగంగా సాగాలి..

- పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత
- పలు ప్రాంతాల్లో పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం ఈనెల 26నుంచి నాలుగు సంక్షేమ పథకాలను అమలుచేయనుండగా లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన సర్వే వేగంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సూచించారు. నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, కొత్తకొత్తూరు, బోదులబండలో సర్వేను గురువారం ఆమె పరిశీలించారు. పలువురి ఇళ్లకు వెళ్లి వివరాల సేకరణ, నమోదు, అర్హత పత్రాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 19నాటికి సర్వే పూర్తిచేసి 20వ తేదీ నుంచి గ్రామసభల్లో ముసాయిదా జాబితాలు వెల్లడించాలని సూచించారు. ఆపై అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సర్వే బృందాలు నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పారదర్శకంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని కొత్తకొత్తూరు శివారులో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగెకరాల భూమిని అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి, డీఐఈఓ కె.రవిబాబు, తహసీల్దార్ జె.మాణిక్‌రావ్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, ఎంపీఓ శివ, ఆర్ఐ ఆలస్యం మధుసూదన్‌రావు, ఏఈఓ అరవింద్, పంచాయతీ కార్యదర్శి బి.రవి తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో సర్వేను పర్యవేక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

అర్హులైన లబ్ధిదారులకే పథకాలు

చింతకాని: అర్హులైన పేదలకే ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పకడ్బందీగా సర్వే చేపట్టాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సూచించారు. చింతకాని మండలంలోని పాతర్లపాడులో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీకి చేపట్టిన సర్వేను గురువారం ఆమె పరిశీలించి ఉద్యోగుల నుంచి వివరాలు ఆరా తీశారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ ముగిసింది..

- మొదలైన తిరుగు ప్రయాణం
- జిల్లా నుంచి హైదరాబాద్ బస్సుల్లో రద్దీ
- ఇదే అదునుగా ఆర్టీసీ 'స్పెషల్' బాదుడు

సత్తుపల్లిటౌన్: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చిన ప్రజలు తిరుగుముఖం పడుతున్నారు. ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు మళ్లీ అక్కడకు బయలుదేరుతున్నారు. దీంతో బస్టాండ్లు మళ్లీ రద్దీగా మారుతుండగా.. ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు స్పెషల్ పేరిట నడిపిస్తున్న బస్సుల్లో చార్జీల మోత మోగుతోంది. దీంతో పండుగ ఆనందంగా జరుపుకుని వెళ్తున్న వారు చార్జీలు చూసి లబోదిబోమంటున్నారు.

సత్తుపల్లి నుంచే అత్యధికంగా..

ఖమ్మం రీజియన్‌లో ఇతర డిపోలతో పోలిస్తే ఖమ్మం తర్వాత సత్తుపల్లి నుంచే అత్యధికంగా ప్రయాణికులు హైదరాబాద్‌కు వెళ్తున్నారు. సాధారణ రోజుల్లో సత్తుపల్లి డిపో నుంచి రోజుకు 16 సూపర్‌లగ్జరీ, నాలుగు రాజధాని, ఒక లహరి బస్సు కలిపి 21 సర్వీసులు ఉంటాయి. ప్రస్తుతం రద్దీ దృష్ట్యా ఈ బస్సులతో పాటు ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం డిపోల నుంచి కూడా కొన్నింటిని సత్తుపల్లి కేటాయించి హైదరాబాద్ నడిపిస్తున్నారు. దీంతో ఈనెల 15వ తేదీన రెగ్యులర్ సర్వీసులే కాక అదనంగా 15, 16వ తేదీన 13 అదనపు సర్వీసులు నడిపించగా, 17వ తేదీన సైతం పది అదనపు సర్వీసులు నడిపించాలని నిర్ణయించారు. కాగా, రద్దీ దృష్ట్యా డీఎం యు.రాజ్యలక్ష్మి, సీఐ విజయశ్రీ, వీబీఓ ఆనంద్, సూపర్‌వైజర్లు బస్టాండ్‌లోనూ ఉంటూ పర్యవేక్షిస్తున్నారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు



హైదరాబాద్‌కు వెళ్లే స్పెషల్ బస్సులు

చార్జీల మోత ఇలా..

రెగ్యులర్ సర్వీసుల్లో ఈనెల 19వ తేదీ వరకు సీట్లన్నీ ముందుగానే రిజర్వ్ అయ్యాయి. దీంతో అదనపు బస్సులకు డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యాన అధికారులు చార్జీలు పెంచడంతో ప్రయాణికులపై భారం పడుతోంది. డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని బస్సుల్లో అదనంగా 50శాతం చార్జీ వసూలు చేస్తున్నారు. సత్తుపల్లి నుంచి హైదరాబాద్ డీలక్స్ బస్సులో రూ.460 ఉండగా స్పెషల్ చార్జీ పేరిట రూ.680, సూపర్‌లగ్జరీ బస్సుల్లో రూ.550 ఉంటే రూ.780, రాజధాని బస్సుల్లో రూ.690 ఉండగా రూ.960 చొప్పున చార్జీ నిర్ణయించారు. దీంతో పండుగ రావడం మాటేమో కానీ బస్సు ప్రయాణంతో జేబుకు చిల్లు పడుతోందని పలువురు మండిపడుతున్నారు. కాగా, హైదరాబాద్‌కు వెళ్లే సమయాన రద్దీ ఉంటున్నప్పటికీ తిరుగు ప్రయాణంలో ఖాళీగా రావాల్సి ఉండడంతో చార్జీ పెంచినట్లు అధికారులు చెబుతున్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు..



ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపిస్తున్నాం. రిజర్వేషన్ బస్సులతో పాటు అదనపు సర్వీసులు ఏర్పాటుచేశాం. ఇతర డిపోల నుంచి బస్సులను కేటాయించడంతో బస్సుకు సరిపడా జనం రాగానే వేచి ఉండకుండా పంపిస్తున్నాం.

– యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డీఎం, సత్తుపల్లి

క్లుప్తంగా

ఆర్చరీ జట్ల ఎంపికకు పోటీలు



పోటీలకు హాజరైన క్రీడాకారులతో ఏఎస్పీ రమేష్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి ఖమ్మం జిల్లా బాల బాలికల ఆర్చరీ జట్ల ఎంపికకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీలను ఇంటెలిజెన్స్ ఏఎస్పీ రామోజీ రమేష్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, నగేష్, కళ్యాణ్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు. కాగా, జట్ల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు.

'వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా కుట్ర'



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కొణిజర్ల: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసి రైతులను తరిమేయాలని కుట్ర పన్నిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు విమర్శించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర వ్యవసాయ పంటల మద్దతు ధర చట్టం తీసుకొచ్చి రైతులకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, తెలంగాణలో సాదా బైనామాలు ఉన్న వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, రైతుల బీమాను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, నాయకులు గుమ్మడెల్లి సైదులు, పీ.వీ.రావు, కూచిపూడి రవి, యాసా వెంకటేశ్వర్లు, తండు సోమయ్య, గడల భాస్కరరావు, లేడిబోయిన గోపాలరావు, పెద్దమళ్ల రత్తయ్య, లకావత్ రాములు నాగరాజు పాల్గొన్నారు.

సాయిమందిరంలో అన్నదానానికి రూ.10లక్షల విరాళం



దాత కుటుంబీకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 14వ డివిజన్ మధురానగర్‌లోని సాయి మందిరంలో ప్రతీ గురువారం అన్నదానం నిర్వహణకు దాతలు రూ.10లక్షల విరాళం ప్రకటించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్న మధురానగర్‌కు చెందిన పోలూరి ఉమామహేశ్వరరెడ్డి – సుందరహరిత దంపతులతో పాటు వారి కుటుంబీకులు నాగసాయి తన్విశ్రీ, రిషినందన్‌రెడ్డి గురువారం ఆలయ కమిటీ బాధ్యులకు రూ.10 లక్షల చెక్కు అందించారు. ఈ సందర్భంగా దాతలను డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సన్మానించారు. ఈకార్యక్రమంలో కాలనీకి చెందిన పోలూరి మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థికంగా ఎదగాలి

పెనుబల్లి: ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తూ జీవితంలో ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెనుబల్లికి చెందిన మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన ఐదు ఇందిరా మహిళా శక్తి యూనిట్లను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటే ఫలితం ఉంటుందన్నారు. యూనిట్ ఏర్పాటు సమయాన మార్కెటింగ్ అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. కల్లూరు ఆర్డీఓ రాజేందర్, అదనపు డీఆర్డీఓ నూరొద్దీన్, తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,575	6,575
మిర్చి	14,000	4,000
ఏసీ మిర్చి	15,400	5,500
ఏసీ తాలు	7,000	5,000
పత్తి	7,050	5,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,506

సాగర్ నీరు వస్తేనే సాఫీగా..

- వైరా రిజర్వాయర్ ఆయకట్టులో రబీ సాగుపై ఆందోళన
- రిజర్వాయర్‌లో 13.1 అడుగుల మేర నీరు
- సాగు, తాగునీటి అవసరాల వినియోగంతో తగ్గుతున్న నీటిమట్టం



రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో నాట్లు వేస్తున్న కూలీలు

వైరా: జిల్లాలోని సాగు వనరుల్లో కీలకమైన వైరా రిజర్వాయర్‌లో నీటి మట్టం రోజురోజుకు పడిపోతోంది. ప్రస్తుత రబీలో రిజర్వాయర్ కింద సుమారు 15వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయనున్నారు. ఇప్పటికే కొందరు రైతులు నారుమడులు సిద్ధం చేసుకోగా, పలువురు నాట్లు కూడా వస్తున్నారు. అయితే, సాగర్ జలాలు విడుదల చేస్తే తప్ప రబీలో సాగు సాఫీగా సాగడం కష్టంగా కనిపిస్తోంది. మరోవైపు అధికారులు మార్చి చివర నుంచి రిజర్వాయర్ కాల్వల ఆధునీకీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. అదే జరిగితే రబీ సీజన్ చివరలో ఇక్కట్లు ఎదురుకావడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

రోజుకు 33 క్యూసెక్కుల నీరు అవసరం

రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 18.4 అడుగులు కాగా, ఖరీఫ్‌లో 25 వేల ఎకరాల్లో ఆయకట్టు కింద వరి సాగు చేశారు. ఇక ప్రస్తుతం రబీలో వరితో పాటు మొక్కజొన్న తదితర పంటల సాగు కోసం రోజుకు 33క్యూసెక్కుల నీరు అవసరమవుతోంది. కుడి కాల్వ పరిధిలో 8వేల ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలో అంచనా మేరకు సాగులోకి రావాలంటే పూర్తి స్థాయి నీటి మట్టం మేర ఉండాలి. ఇప్పటికే సుమారు 2వేల ఎకరాల్లో వరి నాట్లు వేయగా, ఖరీఫ్ వరి పంట కోతలు వారంలోగా పూర్తయ్యాక రబీ సాగు విస్తీర్ణం పెరగనుంది. రిజర్వాయర్‌లో 1.6 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ మార్చి చివరి వరకు సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. సాగర్ జలాలను వైరా రిజర్వాయర్‌కు చేరిస్తే తప్ప రబీ గట్టెక్కడం కష్టంగా మారుతుందని చెబుతున్నారు.

25 నుండి వారబందీ

వైరా రిజర్వాయర్‌కు వర్షాధారంగా తప్ప ఇతర మార్గాల్లో నీరు వచ్చే అవకాశం లేక ఏటా వేసవిలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఫలితంగా ప్రతీ సంవత్సరం వేసవిలో సాగర్ జలాలు విడుదల చేస్తేనే అటు సాగు, ఇటు తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. ఈసారి అవసరాలు పెరగనుండడంతో ఈనెల 25నుండి ఆయకట్టుకు వారబందీ విధానంలో నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. వారం పాటు నీరు ఇచ్చి మరో వారం పాటు నిలిపివేయాలని ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. అయినప్పటికీ సాగర్ జలాలు విడుదల చేస్తే తప్ప మరో రెండు నెలల తర్వాతైనా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి లేకపోలేదు. ప్రస్తుతం రోజుకు 33 క్యూసెక్కుల మేర నీరు సాగుకు, మరో 37 క్యూసెక్కుల నీటని మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. రోజుకు ఈ 70 క్యూసెక్కులు కాక ఆవిరి రూపంలో మరో 3 క్యూసెక్కుల నీరు వృథా అవుతుండగా నీటిమట్టం పడిపోతోంది.

మార్చి చివరిలో ఆధునీకీకరణ

రిజర్వాయర్ ఆధునీకీకరణ పనులకు రూ.42 కోట్లు మంజూరు చేయగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఈ నెలాఖరుకు అగ్రిమెంట్లు చేసి మార్చి చివరి నుండి పనులు ప్రారంభించేందుకు జల వనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రిజర్వాయర్ 12వ నంబర్ తూము నుండి గైడ్‌వాల్స్‌ను, 8వ నంబర్ తూము కోస్తాల నుంచి గొల్లపూడిలోని 16వ నంబర్ తూము వరకు ఆధునికీకరించేలా ప్రణాళిక సిద్ధమైంది. ఈనేపథ్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందిస్తే రబీలో వరి, మొక్కజొన్న పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల చేయడం సాధ్యమవుతుంది. లేకపోతే సాగుకే కాక తాగు అవసరాలకు ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం..

వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రబీలో వరి సాగుకు ప్రస్తుతం ఉన్న నీరు సరిపోయేలా లేదు. ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సాగర్ జలాలు రిజర్వాయర్‌లోకి విడుదల చేస్తే సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– శ్రీనివాస్, జల వనరుల శాఖ డీఈ

23న ఏఏఐ బృందం రాక

- పాల్వంచ, కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో పర్యటన
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలన



కేంద్ర మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించేందుకు ఈనెల 23న ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) టెక్నికల్ టీమ్ జిల్లాలో పర్యటిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ బృందం 20వ తేదీనే జిల్లాకు రావాల్సి ఉంది. ఈ అంశంపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మంత్రి తుమ్మల ఫోన్‌లో గురువారం మాట్లాడారు. దీనికి కేంద్రమంత్రి స్పందిస్తూ ఏఏఐ బృందం ఈనెల 20కి బదులు 23న వస్తుందని తెలిపారు.

ఆరుగురు సభ్యుల ప్రత్యేక బృందం..

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఆరుగురు సభ్యుల ప్రత్యేకబృందం 23వ తేదీన కొత్తగూడెం, పాల్వంచ పరిసర ప్రాంతాల్లో పర్యటించనుంది. ఈ బృందంలో అబ్దుల్ అజీజ్ (ఏరో ప్లానింగ్), మహ్మద్ సఖీబ్(ఆర్కిటెక్ట్), ప్రశాంత్ గుప్తా (ఆపరేషన్స్), సీఎస్ఎస్ఆర్ దివాకర్ (ఆపరేషన్స్), మనీష్ జోన్వాల్, ఎఫ్‌పీడీ ప్రవీణ్ ఉన్ని కృష్ణన్ ఉన్నారు. వీరి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ, అటవీ, వాటర్ రిసోర్సెస్ శాఖల అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

రూపురేఖలు మారుతాయి

విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయి. వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వాణిజ్యపరంగా, పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి విమానాశ్రయం దోహదం చేస్తుంది. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఉపయోగపడుతుంది.

– తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర మంత్రి

పెరుగుతున్న మిర్చి విక్రయాలు

ఇదే సమయాన తగ్గుతున్న ధర



ఖమ్మం మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి విక్రయాలు క్రమంగా పెరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ ముందు రోజుకు 10 వేల బస్తాల వరకు తీసుకురాగా, గురువారం సుమారు 20 వేల బస్తాల మిర్చిని రైతులు తీసుకొచ్చారు. ఇదే సమయాన ధర పడిపోతుండడం గమనార్హం. ప్రస్తుతం విదేశాల్లో మిర్చికి డిమాండ్ లేకపోవడం, ప్రధానంగా చైనా నుంచి ఆర్డర్లు రాకపోవడం ధరపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక తాలికోత మైలకాయ కావడం కూడా ధర పతనానికి మరో కారణంగా చెబుతున్నారు. ఈనెల 9వ తేదీ వరకు మిర్చి ధర క్వింటాకు రూ.15,700 ఉండగా, గురువారం గరిష్ట ధర రూ.14వేలుగానే నమోదైంది. అలాగే, ఏసీ మిర్చి ధర రూ.15,400గా పలకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాధారణ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

- శస్త్రచికిత్సలు ఎక్కువగా నమోదయ్యే ఆస్పత్రుల వైద్యులపై చర్యలు
- డీఎంహెచ్‌ఓ కళావతిబాయి



డీఎంహెచ్‌ఓ కళావతిబాయిని సన్మానిస్తున్న గంగారం పీహెచ్‌సీ ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు అవగాహన కల్పించి సాధారణ ప్రసవానికి ప్రోత్సహించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. ఈక్రమంలోనే సాధారణ కాన్పులు తక్కువగా.. సిజేరియన్లు ఎక్కువగా నమోదవుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం, గంగారం పీహెచ్‌సీ, యూనాని ఆస్పత్రులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సాధారణ కాన్పులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మాతా, శిశుమరణాలను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని, పుట్టిన వెంటనే శిశువులకు ముర్రుపాలు పట్టించేలా ప్రచారం చేయాలని చెప్పారు. అంతేకాక వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని తెలిపారు. అలాగే, కంటిశుక్లాల ఆపరేషన్లు అవసరమైన వారిని ఖమ్మం జనరల్ ఆస్పత్రికి పంపించాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌ఓను వైద్యులు, సిబ్బంది సత్కరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, డీపీఓ దుర్గాభవాని, డెమో సాంబశివరెడ్డి, వైద్యులు ఆర్.అవినాష్, పి.స్పందన, కాశియ్య, సూపర్‌వైజర్ శారారాణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

వేంసూరు: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. వేంసూరు పీహెచ్‌సీని తనిఖీ చేసి ఆమె రికార్డులు పరిశీలించి వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారాం, డాక్టర్ ఇందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

పెనుబల్లి: పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆమె ఫార్మసీ, వ్యాక్సిన్లు, ఓపీ రికార్డులు పరిశీలించి పలు అంశాలపై సమీక్షించారు. డీపీఓ దుర్గాభవానీ, డాక్టర్ కిరణ్‌కుమార్‌తో పాటు సాంబశివరెడ్డి, పూలమ్మ, సుగుణ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చంద్రశేఖర్

చింతకాని: ప్రభుత్వ చేయూత, స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అభివృద్ధి సాధించాలని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో విజయభారతి మహిళా మండలి, సంస్థ ఆధ్వర్యాన మగ్గం వర్క్, జూట్ బ్యాగ్‌లు, వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు గురువారం ఆయన సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ రామయ్య, కోర్సు కోఆర్డినేటర్ వహీద్, విజయభారతి మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో మాలల ఆధిపత్యం..

- అందుకే ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు కుట్రలు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

ఏన్కూరు: రాష్ట్రంలో అన్ని వర్గాలు, అన్ని పార్టీలు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నప్పటికీ మాలలే అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. ఖమ్మం జిల్లా ఏన్కూరులో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఆగస్టులో సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణను మొదట రాష్ట్రంలోనే అమలుచేస్తామని శాసన సభలో ప్రకటించారన్నారు. కానీ నాలుగు నెలలు గడిచినా పురోగతి లేకపోవడానికి కాంగ్రెస్ పార్టీలోని మాలలే కారణమని తెలిపారు. ఆ పార్టీలో మాలల అధిపత్యం కొనసాగుతుండగా వర్గీకరణను అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక పంజాబ్, హర్యానా, తమిళనాడులో వర్గీకరణ అమలు చేయగా ఏపీలోని అక్కడి సీఎం సైతం హామీ ఇచ్చారన్నారు. కానీ ఇక్కడ వర్గీకరణను అడ్డుకునే క్రమంలో అగ్ర కులాల కంటే మాలలే ప్రమాదకారిగా మారారని ఆరోపించారు. ఈనేపథ్యాన ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'వెయ్యి గొంతులు – లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంద కృష్ణ కోరారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ, ఎంఎస్పీ నాయకులు ఏపూరి వెంకటేశ్వరావు మాదిగతో పాటు గిద్దె రామనర్సయ్యతో పాటు అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వరావు, ఆనందరావు, సురేష్, తగరం నర్సింహరావు, యంగళ నరేష్, పూర్ణకంటి నాగరాజు, బొల్లెపోగు నర్సింహరావు, ఇసనపల్లి నాగేశ్వరావు, మైసారావు, జెత్రిపోతుల సుందర్‌రావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాట సీడీ ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్‌లో వచ్చేనెల 7న జరగనున్న లక్ష 'వెయ్యి గొంతులు – లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా రూపొందించిన పాటల సీడీని మంద కృష్ణ మాదిగ ఆవిష్కరించారు. ఖమ్మంలో గురువారం ఆయన ఏపూరి సోమన్నతో కలిసి సీడీని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిద్దె రామనర్సయ్య, నందిగామ రాజ్‌కుమార్, జానీ, బొమ్మెర అరవింద్, వినయ్, బలరాం,ద గ్గుపాటి రమాదేవి, శ్యామ్, సాయి, అక్బర్, కొమ్ము రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో ఎరువులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

చింతకాని: రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య సూచించారు. చింతకాని మండలం నాగులవంచ సొసైటీని గురువారం తనిఖీ చేసిన ఆయన యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించి వ్యవసాయ శాఖ, సొసైటీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. మొక్కజొన్న, వరి పంటలకు అవసరమైన యూరియా ముందుగానే సమకూర్చుకుని అవసరమైన రైతులకు అందజేయాలని తెలిపారు. మొక్కజొన్న పంటకు యూరియా అవసరం పెరుగుతున్నందున మండలంలో రెండు సొసైటీల ద్వారా సరఫరా చేయాలన్నారు. కాగా, నాగులవంచ సొసైటీలో 100 టన్నుల యూరియా నిల్వ ఉన్నందున రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. ఇక ఎవరైనా ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని డీఏఓ హెచ్చరించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, సీఈఓ శ్రీనివాసరావు, ఏఓ మానస, గ్రామపంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు కలగొద్దు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌ఎం సరిరామ్

చుంచుపల్లి: ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ సూచించారు. గురువారం ఆయన కొత్తగూడెం బస్టాండ్‌లో పండుగ ప్రయాణికుల తిరుగు ప్రయాణ రద్దీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులకు బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. హైదరాబాద్‌కు అదనపు ట్రిప్పులు నడిచేలా చూడాలన్నారు. శుక్ర, శనివారాల్లో రద్దీ మరింతగా ఉండే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా బస్సులు నడపాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి: టాటా ఏస్ వాహనాన్ని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం క్రాస్ వద్ద జరిగింది. ఖమ్మం జిల్లా తల్లంపాడుకు చెందిన దేరంగుల సురేష్, ఆయన సోదరి దేరంగుల యమున సంక్రాంతి పండుగకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శంచర్లలోని బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం తిరిగి స్వగ్రామానికి స్కూటీపై బయలుదేరగా గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం క్రాస్ వద్ద ముందు వెళ్తున్న టాటా ఏస్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వీరు ఢీకొట్టారు. ఈ ఘటనలో సురేష్, యమునకు తీవ్ర గాయాలు 108లో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

ఖమ్మంరూరల్: మద్యానికి బానిసవడంతో పాటు కడుపునొప్పి భరించలేని ఓ వ్యక్తి సాగర్ కాల్వ దూకగా గల్లంతయ్యాడు. రూరల్ మండలం కరుణగిరిలోని దివ్యాంగుల కాలనీకి చెందిన సంగోజు పుల్లాచారి(50) కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. దీంతో కడుపునొప్పి వస్తుండగా తట్టుకోలేని ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ గురువారం ఇంట్లో చెప్పి సాగర్ కాల్వ వద్దకు చేరుకున్నాడు. అక్కడ అందరూ చూస్తుండగానే కాల్వలోకి దూకిన ఆయన గల్లంతయ్యాడు. ఈమేరకు సమాచారం అందుకున్న పుల్లాచారి భార్య మదన బాయమ్మ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు గురువారం సీజ్ చేశారు. వనంవారి కిష్టాపురం వద్ద ఎస్ఐ అనంతరాములు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా ఇసుక తరలింపు అనుమతి లేదని తేలడంతో సీజ్ చేశామని సీఐ మురళి తెలిపారు. ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు కలిపి 10మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఠాణా ఎదుట గుమిగూడిన జనం

కొత్తగూడెంఅర్బన్: బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ప్రమేయం లేని వ్యక్తిపై కూడా కేసు పెట్టారని బంధువులు కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ ఎదుట గురువారం గుమిగూడారు. ఇటీవల బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌పై దాడి చేసిన ఘటనలో ఉదయ్ అనే వ్యక్తి దాడిని అడ్డుకున్నాడని, అతనిపై కేసు నమోదు చేయడం సరికాదంటూ బంధువులు ఆందోళన చేయడానికి సిద్ధపడ్డారు. స్టేషన్ వద్దకు భారీగా జనాలు చేరారు. అనంతరం అక్కడి నుంచి కోర్టు వద్దకు వెళ్లిపోయారు.

శివోహం !

ఏటా మహాశివరాత్రికి కూసుమంచిలోని కాకతీయుల కాలం నాటి శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో శివమాల ధరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం కూసుమంచితో పాటు పరిసర గ్రామాలకు చెందిన 101 మంది దీక్ష స్వీకరించారు. వీరు 41 రోజుల పాటు పూజలు కొనసాగించి మహాశివరాత్రికి దీక్ష విరమిస్తారు.

– కూసుమంచి



గొంతులో గారె ఇరుక్కుని వృద్ధురాలు మృతి

తల్లాడ: పండుగ వేళ కుమారుడు పంపించిన గారెలు తినే క్రమంలో గొంతులో ఇరుక్కోగా ఓ వృద్ధురాలు మృతి చెందింది. తల్లాడకు చెందిన మొక్కా తిరపతమ్మ(80) పెద్దకుమారుడితో కలిసి ఉంటుంది. కనుమ పండుగ సందర్భంగా బుధవారం ఆమెకు మరోచోట ఉండే చిన్న కుమారుడు గారెలు, చికెన్ పంపించాడు. అయితే, తిరపతమ్మకు దంతాలు సరిగా లేక నేరుగా మింగేందుకు యత్నిస్తుండగా గారె గొంతులో ఇరుక్కుపోయినట్లు తెలిసింది. దీంతో ఊపిరి ఆడక ఆమె మృతి చెందింది. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కల్లూరు: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కల్లూరుకు చెందిన కారు మెకానిక్ మొగిలిచర్ల ప్రతాప్ (38) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈనెల 15న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు కల్లూరులో చికిత్స చేయించి ఖమ్మం తరలించగా పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని మూడు గొర్రెలు మృతి

తల్లాడ: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మూడు గొర్రెలు మృతి చెందగా, మరో రెండింటికి తీవ్ర గాయాలయ్యాయి. మండలం రామానుజవరానికి చెందిన రాచబంటి కిషోర్, గోపిదేశి రామకృష్ణ, లీలమ్మ రెడ్డిగూడెంలో కొద్దిరోజులుగా ఉంటూ గొర్రెలను మేపుతున్నారు. రోజుమాదిరిగానే గొర్రెలను మేపుకొని రెడ్డిగూడెం వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మందలోని మూడు జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో రెండింటికి తీవ్ర గాయాలు కాగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.